నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 5 ఏప్రిల్ 2024 | KARIMNAGAR




### కేసీఆర్ సార్ ఉన్నప్పుడు గిట్ల లేకుండె

నేను నాలుగు ఎకురాలల్ల వరి ఏసిన. నిండు పొట్టకచ్చింది. ఇంకో రొండు తడులైతే పంట చేతికచ్చేది. నీళ్లు రాక మొత్తం ఎండిపోయింది. మా కట్టం ఎవలకు చెప్పుకోవన్నో అర్థమైతలేదు. మా ఊళ్ల నూటికి 60 శాతం పంటలు ఖతమైనయి. నీళ్లు ఇస్తరనే నమ్మకంతోనే పంటలు సాగు చేసినం. ఏడెమిది సార్లు నీళ్లిచ్చిన్రట. ఒక్కసారన్నా మాకు నీళ్లు రాలే. మొదట్ల రెండు మూడు రోజులు ఇచ్చినమా అంటే ఇచ్చినమన్నట్టు ఇచ్చిన్రు. అటెన్క ఒక్క సారన్న నీళ్లు రాలే. ఇక ఎట్ల బైటవడ్తం? కేసీఆర్ సార్ ఉన్నప్పుడు గిట్ల లేకుండె. నీళ్లు వాగుల ఇడిస్తే పారు కుంట పోయినయి. బాయిల్ల నీళ్లు ఉబ్బుతుండే. అప్పుడు కరువన్న ముచ్చటే లేకుండె.

- దాడి లచ్చయ్య, మొగ్దుంపూర్





చందుర్తి : మల్యాలలో ఎండిన వరిని చూపుతున్న మహిళా రైతు గంగ లక్ష్మి




- ఇది కేసీఆర్ పనితనం

మిడ్‌మానేరు జలాశయం గేట్ల నుంచి దుంకుతున్న కాళేశ్వర జలాలు (ఫైల్)

సమైక్య రాష్ట్రంలో సాగునీటి రంగంపై దారుణమైన వివక్ష ఉండేది. అందుకు మిడ్‌మానేరు జలాశయమే పెద్ద ఉదాహరణ. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లోని రెండు లక్షలకుపైగా ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో 2006లో మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మాణానికి పునాది రాయి పడింది. మూడేళ్లలో పనులు పూర్తి కావాల్సి ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం అంతులేని నిర్లక్ష్యం చూపింది. కాంట్రాక్టు సంస్థలను మారుస్తూ.. గడువు పొడిగిస్తూ పోయినా 20 శాతం కూడా పూర్తి చేయలేకపోయింది. పదేళ్లు గడిచినా పనులు కొనసాగలేదు. కానీ, బీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల మీద ప్రేమతో మూడేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేసి చూపింది. పనులతోపాటు నిర్వాసితుల పరిహారం కోసం ₹500 కోట్లకుపైగా ఖర్చు చేసింది. కాళేశ్వర జలాలతో నిండుకుండలా మార్చి రైతన్నకు భరోసానిచ్చింది.




మిడ్‌మానేరులో నీళ్లు తగ్గడంతో తేలిన ముంపు గ్రామం చీర్లవంచ

- ఇది కాంగ్రెస్ చేతగానితనం!

కాంగ్రెస్ పాలనలో మళ్లీ వివక్ష కొనసాగుతున్నది. పదేళ్ల కిందట ఎలా ఉన్నదో.. ఇప్పుడు అలాంటి దుస్థితే కనిపిస్తున్నది. ఉమ్మడి జిల్లా రైతులు సాగునీటి కోసం తండ్లాడాల్సి వస్తున్నది. సాగునీటి ప్రణాళిక అమలులో సర్కారు వైఫల్యమే కారణమని రైతాంగం ఆరోపిస్తున్నది. మేడిగడ్డ వద్ద కుంగిన పిల్లర్లను సాకుగా చూపుతూ.. నీళ్లివ్వడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడుతున్నది. నాడు సమైక్య రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మొదలు పెట్టి వదిలేసిన మధ్యమానేరు ప్రాజెక్టును కేసీఆర్ సర్కారు కేవలం మూడేళ్లలోనే పూర్తి చేసిందని గుర్తు చేస్తున్నది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ వద్ద మరమ్మతులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నిస్తున్నది. రాజకీయ కక్షకు వెళ్లడంతోనే ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహిస్తున్నది. ఈ ప్రభుత్వం తమపై కక్ష తీర్చుకుంటున్నదని, ఇలా చేయడం చేతగానితనానికి నిదర్శమని మండిపడుతున్నది.

# అన్నదాతకు అండగా..

## నేడు రైతుబాంధవుడు కేసీఆర్ పొలంబాట

ఆది నుంచీ రైతులకు భరోసాగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి

పదేళ్లలో ఏ కష్టం రాకుండా వెన్నంటే • కాంగ్రెస్ పాలనలో రైతన్న అరిగోస • కన్నీరు తుడిచి అభయమిచ్చేందుకు నేడు ఉమ్మడి జిల్లాకు రాక • మొగ్దుంపూర్, బోయినపల్లిలో పంటల పరిశీలన

**రైతుబాంధవుడు కేసీఆర్ అన్నదాతల కష్టాలు తీర్చేందుకు కదిలారు. కాంగ్రెస్ పాలనలో రైతులు పడుతున్న బాధలు తెలుసుకుని, వారికి అండగా నిలిచేందుకు పొలంబాట పట్టారు. ఇప్పటికే జనగామ, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించిన ఆయన, నేడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వస్తున్నారు. మొగ్దుంపూర్, బోయినపల్లిలో ఎండిన పొలాలను పరిశీలించి, రైతన్నలకు భరోసా ఇవ్వనున్నారు.**

కరీంనగర్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, రైతుబాంధవుడు కేసీఆర్ ఆది నుంచీ రైతులకు అండగా నిలుస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో దండుగన్న వ్యవసాయాన్ని స్వరాష్ట్రంలో పండుగలా మార్చారు. సాగునీరు, 24గంటల కరెంట్, రైతుబంధు, రైతుబీమా, పంటల కొనుగోళ్లు ఇలా ఎన్నో కార్యక్రమాలతో ఏకష్టం రాకుండా చూసుకున్నారు. ఈ పరిస్థితుల్లోనే వేలాది ఎకరాల బీడు భూములు సాగులోకి రాగా, రైతులు బంగారం లాంటి పంటలు పండించారు. పదేళ్లపాటు నిరందీగా ఉన్నారు. గతేడాది మార్చిలో వడగళ్లవాన తీవ్ర నష్టం చేకూర్చగా.. ఆయన తట్టుకోలేకపోయారు. వెంటనే ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో పర్యటించారు. దెబ్బతిన్న పంటలను చూసి చలించిపోయారు. 'నేనున్నా.. అధైర్య పడొద్దు' అంటూ భరోసానిచ్చారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎకరానికి ₹10 వేల పరిహారం ఇస్తానని ప్రకటించారు. ప్రకటించడమే కాదు.. నెలరోజుల్లోనే చెల్లింపునకు ఆదేశాలిచ్చారు. పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా.. విడుతల వారీగా ఖాతాల్లోనే జమ చేయించారు. ఇలా ఎప్పుడూ అన్నదాత పక్షాన నిలిచిన ఆయన, ఇప్పుడు అధికారంలో లేకున్నా రైతుల కోసమే తపిస్తున్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో సాగునీరు లేక, వేలాది ఎకరాల్లో పంటలు ఎండి రైతులు అరిగోస పడతుండగా.. కేసీఆర్ చలించిపోతున్నారు. ప్రస్తుతం తెలంగాణ సహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల సుడిగుండంలో తిరుగుతుంటే ఆయన మాత్రం రైతుల కన్నీళ్లను తుడిచేందుకు పొలంబాట పట్టారు. ఇప్పటికే జనగామ, సూర్యాపేట జిల్లాలో పర్యటించిన ఆయన, నేడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు వస్తున్నారు. ఉదయం హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 10.30 గంటలకు కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌కు చేరుకోనున్నారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడుతారు.అనంతరం ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో భోజనం చేస్తారు. అక్కడినుంచి బయలుదేరి బోయినపల్లికి చేరుకొని, ఎండిన పంటలను పరిశీలిస్తారు. ఆ తర్వాత శాబాష్‌పల్లి వద్ద మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం)ను చూస్తారు. సాయంత్రం 4గంటలకు సిరిసిల్లలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని ప్రెస్‌మీట్ నిర్వహించనున్నారు.

# జలసిరుల నుంచి కరువు కోరల్లోకి..

**ఎండని చేనూ లేదు.. ఏడ్వని రైతు లేడు**

*కాంగ్రెస్ పాపం.. రైతన్నకు శాపం*

*ఒక డెవలప్‌మెంట్ గురించి చెప్పుకోవాలంటే గతం నుంచి వర్తమానానికి పోలుస్తం! భవిష్యత్‌కు తగిన ప్రణాళిక వేసుకొని ముందుకుసాగుతం! కానీ, కాంగ్రెస్ పాలనలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది! దశాబ్దాల సాగునీటి గోసను స్వరాష్ట్రంలో తీర్చుకొని జలసిరులతో సుభిక్షంవైపు పయనిస్తే.. ఇప్పుడు మళ్లీ సాగునీటి సమస్య మొదలై పదేండ్ల కిందటి రోజులను గుర్తు చేసుకోవాల్సి వస్తున్నది.*



### నీళ్లు లేక పంట వదులుకున్న

ప్రతి సంవత్సరం ఎస్సారెస్పీ కాల్వల ఫుల్లు నీళ్లు వచ్చేవి. పంటకు సరిపడా మిగిలినవి వాగులోకి వెళ్లేవి. బావులల్ల కూడా మస్తు నీళ్లుండేవి. ఈసారి నాలుగు ఎకరాలు వరి సాగు చేసిన. కాల్వల నీళ్లు సక్కగ రాక పంట వదులుకున్న. నీళ్లు లేక బాయిలల్ల కూడా ఊట లేదు. పూటిక తీసినా వచ్చేటట్టు లేవు. నాతోపాటు చాలా మంది రైతులు పంట నష్టపోయిన్రు. ఎకరానికి రూ.40 వేలు ఖర్చు చేసిన. చివరకి ఎకరమన్న కాపాడుకోలేకపోతున్న.

-పొలగాని సంపత్, రైతు, మొగ్దుంపూర్, కరీంనగర్ రూరల్ మండలం

### నీళ్ల కోసం అరవై వేలు పెట్టిన



చేన్లన్నీ నిండు పొట్టకచ్చినయి. ఆఖరికి నీళ్లు లేక ఎండిపోతున్నయి. రెండు తడులిస్తే అందరం బైటవడ్తుం. నేను తొమ్మిదెకరాలు నాటేసిన. కాలువల నీళ్లచ్చుడు లేదు. బాయిలు ఎండిపోతున్నయి. వాగుల కిలోమీటరు దూరంల ఉన్న ఒక బాయి నీళ్లు 20వేల రూపాయలు పెట్టి కొనుక్కున్న. అక్కడికెళ్లి 40వేలు పెట్టి పైప్ లైన్ ఏసుకున్న. అయినా రెండెకరాలు ఎండిపోయింది. నీళ్లు అందితే ఈ పరిస్థితి రాకపోయేది.

- మంద అశోక్, మొగ్దుంపూర్

### కేసీఆర్ వస్తే ఈ బాధలు ఉండకపోవు



నిరుడు, మోయేడు వాగులవడి నీళ్లు పోతుండె. మేం వాడుకోంగ మెదులు తెంపితే నీళ్లు వాగుల వడుతుండె. ఈ యేడు ఎసొంటి పరిస్థితి వచ్చింది. బాయిల్ల నీళ్లు సుతం వట్టిగనే ఒడిసిపోతన్నయి. మొన్నటిదాకా ఎండకాలం సుతం బాయిలు నిండుకుండల్లెక్క ఉండేటిది. ఒకటేసారి ఇట్లయిపోయింది. కేసీఆర్ వస్తే మాకు ఇన్ని బాధలు ఉండకపోవు. అప్పుడు నీళ్లుబాగనే వచ్చినయి. వాడుకోంగ వదిలేస్తుంటిమి.

- బండి సంపత్, మొగ్దుంపూర్



### కౌలు మీదవడే కాలమచ్చింది

మాది మొగ్దుంపూర్. ఊళ్లే మొత్తం నాలుగెకురాలు నాటేసిన. అండ్ల కాలువ కింద మూడెకరాలు పోయింది. బాయి కింద ఏసిన ఎకరం ఎండుకానికి వస్తంది. రెండెకరాలు కౌలుకు వట్టిన. పెట్టువడి మునుగుడైతంది. కౌలు మీద వడే కాలమచ్చింది. మా ఊళ్లె అందరి పరిస్థితి ఇట్లనే ఉంది. మునుపు గిట్ల లేకుండె. నీళ్లు వద్దంటే అచ్చేది. ప్రాజెక్టుల్ల నీళ్లున్న సుత ఇవ్వలె. రైతులను గోసపెడితే సర్కారుకు మంచిదైతదా..?

- పొలగాని ఐలయ్య, మొగ్దుంపూర్

- నాడు పరవళ్లు.. నేడు కన్నీళ్లు
- సాగునీరు లేక ఎండుతున్న పొలాలు
- వేలాది ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- వంద రోజుల పాలనలోనే పదేండ్లు వెనక్కి
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న రైతులు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా కరువు కోరల్లో చిక్కింది. మొన్నటిదాకా జలసిరులతో కళకళలాడిన ప్రాంతం, ఇప్పుడు కాంగ్రెస్ వందరోజుల పాలనలో సాగునీటి కోసం అల్లాడిపోతున్నది. ఎస్సారెస్పీతోపాటు మిడ్‌మానేరు, ఎల్ఎండీ, ఎల్లంపల్లి లాంటి ప్రధాన జలాశయాలు ఉన్నా చుక్క నీరు రాక పంటలన్నీ ఎండిపోతుండగా, రైతుకు కన్నీరే మిగులుతున్నది. 'ఏ ఊళ్లో చూసినా ఎండని చేను లేదు.. ఏడ్వని రైతు లేడు' అన్నచందంగా పరిస్థితి తయారైంది. ఇప్పటికే వేలాది ఎకరాల్లో పంట ఎండిపోగా, ప్రభుత్వం నుంచి స్పందన లేక రైతులు రోడ్డెక్కుతున్నారు. ఇది ప్రకృతి ఇచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువేనని మండిపడుతున్నారు. వందరోజుల పాలనలోనే పదేండ్ల కాలం వెనక్కిపోయిందని విలపిస్తూ, తమను ఆదుకునే వారి కోసం దీనంగా చూస్తున్నారు. ఈ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదని చెబుతున్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏనాడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదని, ఏ కష్టం వచ్చినా కేసీఆర్ తమకు అండగా నిలిచారని గుర్తు చేస్తున్నారు.**

- కరీంనగర్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)

### బీఆర్ఎస్ పాలనలో పండుగలా ఎవుసం

కేసీఆర్ పాలనలో ఉమ్మడి జిల్లా జలవనరులతో కళకళలాడింది. పదేళ్లపాటు సాగునీటికి రంది లేకుండా పోయింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం అందుబాటులోకి వచ్చిన తర్వాత కాలంతో సంబంధం లేకుండా గోదావరి జలాలు పరుగులు తీశాయి. లక్ష్మీ, పార్వతీ, సరస్వతీ బరాజ్‌లు, ఎల్లంపల్లి, నంది, ఎగువమానేరు, మిడ్‌మానేరు, దిగువమానేరు, అన్నపూర్ణ జలాశయాలకు తోడు చెరువులు, కుంటలు జలకళలాడాయి. పంప్‌హౌస్‌ల నుంచి నీటిని ఎత్తిపోయడంతో మండుటెండల్లోనూ జలసిరులు పరవళ్లు తొక్కాయి. మెట్టప్రాంతాన్ని సుభిక్షంగా మార్చాయి. నాడు వట్టిపోయిన వరదకాలువ జీవం పోయడమే కాదు, కాకతీయ కాలువ గుండా పరుగులు తీశాయి. చరిత్రలోనే మొదటిసారిగా 146 రోజులపాటు ప్రవహించి ఎస్సారెస్పీ ఆయకట్టు చివరి భూములనూ తడిపాయి. పుష్కలంగా నీరు రావడం, బీఆర్ఎస్ సర్కారు ప్రోత్సాహం అందించడంతో రైతులు పోటీపడి మరీ సాగు చేశారు. రెండు సీజన్లలోనూ బంగారంలాంటి పంటలు పండించారు. ఉమ్మడి జిల్లాను సీడ్‌బౌల్ ఆఫ్‌గా తెలంగాణ మార్చారు.

### కాంగ్రెస్ పాలనలో ఆశలు ఆవిరి

కాంగ్రెస్ వంద రోజుల పాలనలో అంతా తారుమారైంది. కేసీఆర్ పాలనలో సుభిక్షంగా మారిన ఉమ్మడి జిల్లా, ఇప్పుడు కరువు కోరల్లో చిక్కుకున్నది. పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా సాగునీటి సమస్య మొదలైంది. ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు వెలవెలబోతుండగా.. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టులో పరిస్థితి దయనీయంగా ఉన్నది. నిరుడు మాదిరిగానే ఈ యాసంగిలోనూ నీళ్లు వస్తాయని నమ్మిన రైతులు ఇప్పుడు నిండా మునగాల్సిన దుస్థితి వచ్చింది. కాలువల ద్వారా నీళ్లు రాక, కాళేశ్వరం జలాలు లేక వేలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి. నోటికాడి బుక్కను ఎత్తగొట్టినట్టు.. చేతికొచ్చే సమయంలో నీళ్లివ్వకపోవడంతో పొలాలు దెబ్బతింటున్నాయి. ఎక్కడా చూసినా రైతులు సాగునీటి కోసం తండ్లాడుతున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. చొప్పదండి, కరీంనగర్, మంథని నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో పంటలు ఎండిపోయాయి. కండ్లముందే ఎండుతున్నా కన్నీళ్లు కార్చడం మినహా ఏమీ చేయలేని దుస్థితి. అటు వరద కాలువకు నీళ్లివ్వాలని రైతులు ఆందోళనకు దిగితే తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించ లేదు. గంగాధర, మల్యాల, రామగుడు, బోయినపల్లి తదితర మండలాల్లో 60 శాతం పంటలు ఎండిన తర్వాత వరద కాలువకు కంటితుడుపుగా 0.1 టీఎంసీ నీటిని విడుదల చేశారు. ఈ నీళ్లు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఈ ప్రాంత రైతులు ఆవేదన చెందుతున్నారు. సకాలంలో నీటిని విడుదల చేస్తే కనీసం భూగర్భ జలాలు పెరిగి ఉన్న పంటలనైనా కాపాడుకునే అవకాశం ఉండేదని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యహరించి తమకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని వాపోతున్నారు.

### రైతుల అరిగోస


సాగునీరు రాక ఎక్కడికక్కడ పంటలు ఎండుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 'మీరు పంటలు వేసుకోండి. మేం నీళ్లిస్తాం' అని ఎన్నికల ముందు ఆ పార్టీ చెప్పిన మాటలను నమ్మి మోసపోయామని మండిపడుతున్నారు. సర్కారు తీరుకు నిరసనగా రోడ్డెక్కుతున్నా స్పందన లేదని వాపోతున్నారు. కాపాడుకునే దారి లేక పంటలను వదిలేస్తున్నామని ఆవేదనగా చెబుతున్నారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిన కరువేనని ఆగ్రహిస్తున్నారు. పదేండ్లలో రాని కరువు, ఇప్పుడెందుకు వస్తదని ప్రశ్నిస్తున్నారు. పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే అని ఆరోపిస్తున్నారు. కేసీఆర్ పాలనలో ఏనాడూ సాగునీటికి ఇబ్బంది పడలేదని, రంది లేకుండా ఎవుసం చేసుకున్నామని గుర్తు చేస్తున్నారు. కానీ, కాంగ్రెస్ వంద రోజుల పాలనలో అరిగోస పడుతున్నామని మండిపడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పిల్లర్లు కుంగాయనే సాకును చూపడం సరికాదని సూచిస్తున్నారు. కక్ష పూరితంగా వ్యవహరించడం ఎంత మాత్రం మంచిది కాదని హితవు పలుకుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని, ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.




*కరీంనగర్ రూరల్ మండలంలో రైతులు సాగునీటి కోసం భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడ చూసినా బావుల్లో పూడిక తీయిస్తూ కనిపిస్తున్నారు. గురువారం మొగ్దుంపూర్‌లోని వ్యవసాయ బావిలో ఇలా క్రేన్ సహాయంతో పూడిక తీయించారు.*

### కన్నీళ్లే మిగిలినయ్

మానేరు తీరాన ఉన్న మొగ్దుంపూర్ గడిచిన పదేళ్లలో పుష్కలమైన పంటలు పండించింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు డీ-93 పరిధిలోకి వచ్చే ఈ గ్రామంలో ఇపుడు 60 శాతానికిపైగా పంటలు ఎండిపోయాయి. కొందరు రైతులు వేలాది రూపాయలు ఖర్చు చేసి మానేరువాగు నుంచి పైప్ లైన్లు వేసుకున్నా.. వాగులో భూగర్భ జలాలు కూడా ఇంకుతుండడంతో పంటలను రక్షించుకునే మార్గాలు లేకుండా పోయాయి. డీ-93 కాలువ ద్వారా గతంలో 125 నుంచి 130 క్యూసెక్కుల నీటిని విడుదల చేసేది. కానీ, ఈసారి రెండు సార్లు కంటి తుడుపుగా మాత్రమే ఇచ్చారు. ఇచ్చిన 90 నుంచి 95 క్యూసెక్కులు కాలువల పక్కన ఉన్న పొలాలకే సరిపోలేదని రైతులు వాపోతున్నారు. ఇటు బావులు, బోర్లు కూడా ఎండిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. పొట్ట దశలో ఉన్న పంటలను కాపాడుకోలేక బావురుమంటున్నారు. ఇంకో రెండు తడులు నీళ్లిస్తే తమ పంటలు దక్కేవని వాపోతున్నారు.



చందుర్తి : మల్యాలలో ఎండిన పొలంలో దిగాలుగా కూర్చున్న రైతు పోతరాజు తిరుపతి

## కాంగ్రెస్ మైనార్టీలను విస్మరించింది

- ఇఫ్తార్ విందులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



*గంభీరావుపేట : ముస్లింకు కర్జూరం తినిపిస్తున్న ఎమ్మెల్యే కేటీఆర్, చిత్రంలో వినోద్‌కుమార్*

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ)/ గంభీరావుపేట : రంజాన్ వేళ కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలను విస్మరించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ ధ్వజమెత్తారు. ముస్లింలు పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోలేదని, ముస్లిం సోదరులకు ఎలాంటి గిఫ్టులు ఇవ్వలేదని మండిపడ్డారు. కానీ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశారని, అన్ని మతాల పండుగలు ఘనంగా జరుపుకునేలా నిధులు కేటాయించారని గుర్తు చేశారు. బతుకమ్మ పండుగ సందర్భంగా ఆడబిడ్డలకు చీరెలు పంపిణీ చేశామని, రంజాన్ పండుగకు ముస్లింలకు తోఫాలను అందించామని చెప్పారు. గురువారం ఆయన కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి సిరిసిల్ల నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. సిరిసిల్ల పట్టణంలో పలు శుభకార్యాలకు హాజరయ్యారు. సిరిసిల్ల అర్బన్ మండలం సర్దాపూర్‌లో ఎల్లమ్మ సిద్దోగం, వీర్నపల్లి మండలం రంగంపేట, బంజేరులోని భక్తాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్ గెలిస్తే బంజేరు భక్తాంజనేయ ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటానన్నారు. అనంతరం గంభీరావుపేట మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మైనార్టీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన మొదటి ప్రభుత్వం కేసీఆర్‌దేనన్నారు. మైనార్టీల పిల్లల కోసం గురుకులాలు ఏర్పాటు చేసిందని, ప్రతి విద్యార్థికీ ₹1.25 లక్షలు ఖర్చు పెట్టిందని చెప్పారు. వినోద్‌కుమార్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో హిందూ, ముస్లింలందరం గంగా జమున వలె కలిసి ఉన్నామన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను గౌరవించిందని చెప్పారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ముస్లింలు ప్రార్థనలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి పాల్గొన్నారు.